


**పురిటిగడ్డను కన్నతల్లి అని భావించే వ్యక్తి ఆయన..** నూనూగు మీసాల వయసులో తన గ్రామం కోసం ఏదో మంచి పనిచేయాలన్న దృఢమైన ఆశయాన్ని గుండె లోతుల్లో పదిల పరుచుకున్న కర్మయోగి.. చిరు ప్రాయంలోనే కమ్యూనిస్టులకు చేరువగా పెరిగి.. కమ్యూనిజంలోని గొప్పతనాన్ని తనువంతా నింపుకుని ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకున్నాడు. విధిరాతే తుదిరాత కాదని తన రాతనే మార్చుకుని నవలోక ఆవిష్కరణకు తపించాడు. అందుకు కార్యోన్ముకుడైన రేగా కాంతారావుతో కలిసి పయనం ఆరంభించాడు. ఆత్మ విశ్వాసంతో నవజీవన బృందావనం నిర్మాణం చేశాడు. ఇష్టమైన చదువును కాంతన్న ఎదుగుదలకు వదులుకుని.. ఆయన గెలుపే తన గెలుపుగా భావించి.. రేగా ఆలోచన.. ఆచరణ.. అణుకువలో తాను ఎక్కడా తీసిపోనితత్వంతో పనిచేస్తూ.. సమర్ధ నాయకుడికి సరైన నమ్మకస్తుడిగా.. రేగాది తండ్రి లాంటి బాధ్యత.. తనది కొడుకు లాంటి కర్తవ్యంగా కీర్తిగడించాడు. ఎన్ని కష్టాలు వచ్చినా.. అవమానాలు ఎదురైనా నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్నాళ్లైనా...ఎందాకైనా... ఎక్కుపెట్టిన బాణంలా.. సామాన్యుడి నుంచి బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షునిగా ఎదిగిన ప్రస్థానం ఓ మహాకావ్యమనే చెప్పాలి. కష్టాలకడగండ్లలో కడిగిన ముత్యంలా మెరిసి కచ్చితమైన మార్పు.. మార్పు కోసం... అనునిత్యం పరితపిస్తున్నారు. ఇంతకూ ఈయన ఎవరనేగా మీ సందేహం.. !! భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం పడిగేరుకు చెందిన **బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు కర్నే మురళి** ప్రస్థానం గురించే ఈ ప్రత్యేక కథనం...!!

శామ్, జూలై 08(కెరటం ప్రతినిధి)

# మాటే.. తుపాకి తూటా



## సమర్ధ నాయకుడికి సరైన నమ్మకస్తుడు

- ఆత్మవిశ్వాసమే ఆయన ఆయుధం..
- రేగాకు ఆలోచన.. ఆచరణ.. అణుకువలో తీసిపోనితత్వం..
- అవమానాలు.. కష్టాలకడగండ్లు ఎదుర్కొన్న నవయుగ అభిమన్యుడు
- గ్రామం భవితకు మార్గం వెతికిన మూల కారకుడు
- అందరివాడిగా.. అజాతశత్రువుగా కీర్తీ గడించిన యువకెరటం
- నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్నాళ్లైనా...ఎందాకైనా...
- సామాన్యుడి నుంచి బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షునిగా ఎదిగిన ప్రస్థానం..
- కడదాకైనా కాంతన్నతోనే... : కర్నే మురళి

**కర్నే మురళి కుటుంబ నేపథ్యమిది...**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం పగిడేరుకు చెందిన కర్నే చంద్రయ్య, చంద్రమ్మ దంపతులకు కలిగిన సంతానంలో ఆఖరి వాడే కర్నే మురళి. పగిడేరులో కర్నే చంద్రయ్యది ఉన్నత కుటుంబం కావడంతో ఆ ప్రాంత వాసులతో పాటు మావోయిస్టులు సైతం కలివిడిగా ఉండేవారు. మావోయిస్టుల ప్రభావిత ప్రాంతం కావడంతో పోలీసుల నుంచి చంద్రయ్య కుటుంబానికి ఇబ్బందులు తలెత్తడంతో వాటి నుంచి రక్షణ పొందడానికి ఉన్న ఆస్తులన్నీ అమ్ముకోవాల్సి వచ్చింది. దీంతో చంద్రయ్య కనీసం చిన్న కుమారుడైన మురళి చదువుకోవాలన్న ఆలోచనతో డోర్నకల్‌లోని బిషప్ మిషనరీ స్కూల్‌లో 2వ తరగతి హాస్టల్‌లో చేర్పించాడు. అక్కడి నుంచి ఇంటర్ వరకు మురళి అక్కడే



పూర్తి చేశాడు. అనంతరం ఖమ్మంలోని వికాస్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ(ఎంపిసి) పూర్తి చేశారు. అనంతరం విజయవాడలోని టెక్నికల్ కోర్సులో చేరి పూర్తి చేశారు. ఈ కోర్సు చేస్తున్న తరుణంలో విమల అనే యువతిని ప్రేమించి.. ఇరు కుటుంబాల పెద్దలను

ఒప్పించి ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని సైతం రేగా ఒక తండ్రిలా దగ్గరుండి జరిపించారు. వీరికి లేఖన నక్షత్ర, రణధీర్ చంద్ర ఇద్దరు సంతానం. విమల ఎంసిఏ, ఏపి సెట్, టిఎస్ సెట్(పీహెచ్.డి), డిగ్రీ అండ్ పీజీ అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. పీహెచ్.డి కంప్యూటర్ సైన్స్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌లో ఏపి స్టేట్ 5వ ర్యాంక్, కాకతీయ యూనివర్సిటీలో 2వ ర్యాంక్ సాధించింది.



## ప్రశ్నించడమే ఆయన నైజం..

చిన్ననాటి నుంచే కమ్యూనిజం సిద్ధాంతాన్ని అవపోశన పట్టిన కర్నే మురళి.. చదువుకునే రోజుల్లోనే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్నారు. చిరుప్రాయం నుంచి నూనూగు మీసాల ప్రాయం వరకు హాస్టల్ జీవితం గడపడంతో తోటి వారి సమస్యల పట్ల ప్రశ్నించేవాడు. అంతేకాదు అటు చదువుల్లోనూ రాణిస్తూ అందరిచేతా శభాష్ అనిపించుకునేవాడు. తాను విజయవాడలో టెక్నికల్ కోర్సు చేస్తున్న తరుణంలో తన స్వగ్రామమైన పగిడేరులో కొంత భూమి సింగరేణి ఓపెన్ కాస్ట్ విస్తరణలో కోల్పోవడంతో నష్టపరిహారం ఇప్పించడం కోసం సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారాన్ని సేకరించి ఎమ్మెల్యే రేగా కాంతారావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన రేగా 45 మందికి నష్టపరిహారం ఇవ్వాలని సింగరేణి అధికారులతో మాట్లాడారు. అంతేకాదు తన గ్రామానికి వెళ్లడానికి రోడ్డు లేక అవస్థలు పడుతున్న విషయాన్ని గుర్తించి తానే స్వయంగా అనేకమార్లు ఎమ్మెల్యే రేగాను కలిసి విన్నవించగా, మొదటి దఫాలో రూ.2.50కోట్లతో రోడ్డు వేపించగా, తాజాగా మరో రూ.4.50కోట్లతో రోడ్డును వేపించారు. రేగానే స్వయంగా బస్ తీసుకుని గ్రామానికి వచ్చారు. అంతే కాదు గ్రామంలో కొత్త ఓటర్లను చేర్పించడం, ఎస్సీ కమ్యూనిటీ హాల్, ఇంటింటికీ గ్యాస్ కనెక్షన్‌లు, అంగన్‌వాడీలు, పాఠశాలల భవనాలు, సీసీ రోడ్లు వేపించడం వంటి కార్యక్రమాలు చేపించారు. అంతేకాదు కమ్యూనిస్టుల కంచుకోట అయిన పగిడేరు గ్రామంలో మొట్టమొదటి సారి కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థిని గ్రామ సర్పంచ్‌గా గెలిపించారు. ఇలా తన పనితనాన్ని.. ప్రశ్నించేతత్వాన్ని గ్రామంలోని కొందరు ఐఏఎస్‌లు, ఉమ్మడి రాష్ట్రంలోని కమిషనర్లు సైతం కర్నే మురళిని వారి ఇంటికి వచ్చి మరీ మెచ్చుకునేవారు. 2019 ఫిబ్రవరి నెల నుండి 2021 డిసెంబర్ నెల వరకు గిరిజన బీఈడీ కళాశాల సమస్యపై ఆర్టీఐ ద్వారా ఒక విప్లవాన్నే రగిల్చాడు కర్నే మురళి. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ప్రత్యేక శ్రద్ధతో పోరాడి కోటి రూపాయల వ్యయంతో విద్యార్థులకు వసతి గృహాన్ని సాధించడంలో కర్నే మురళి కీలకపాత్ర పోషించారు.





## 14 ఏళ్ల నుండి రేగా అడుగులో అడుగై..

తన గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కారానికి ఎమ్మెల్యే రేగా కాంతారావుకు విన్నవించిన ప్రతి సారీ స్పందించిన తీరుకు మంత్రముగ్ధుడైన కర్నే మురళి రేగా కాంతారావుకు అభిమానిగా మారాడు. అది ఎంతలా అంటే రేగా కాంతారావుకు సహాయపడాలన్న సంకల్పంతో తనకు ఎంతో ఇష్టమైన బీఎస్సీ(ఎంపిసి) చదువును వదులుకుని రేగా గెలుపులో ఎనలేని పాత్ర పోషించేలా చేసింది. సామాన్య ప్రజల సమస్యలను ఎలా పరిష్కరించు కోవాలో తెలుసుకు నేందుకు హుమన్ రైట్స్ ఇన్ డిప్లమో చేశారు. నాగార్జున యూనివర్శిటీలో మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ చదివారు. రచన జర్నలిజం కళాశాలలో జర్నలిజం సైతం పూర్తి చేశారు. ఈ భూమి మీద ఏ ప్రాంతంలో ఉన్న రేగా కోసం పనిచేయాలని ముందు చూపుతో భవిష్యత్తులో రాజకీయాలకు సోషల్ మీడియానే వెపన్ అవుతుందని గ్రహించి సోషల్ మీడియాను ఎలా వినియోగించుకోవాలి అనే అంశంపై వందలాది వీడియోలను పరిశీలన చేసి అర్థవంతంగా.. ప్రాసలు.. పంచులతో ఆకర్షణీయమైన పోస్టులు పెట్టడం స్వతహాగా నేర్చుకున్నారంటే పని పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతకు నిదర్శనమనే చెప్పాలి. 2017 సెప్టెంబర్ 22వ తేదీన కర్నే మురళికి బాబు పుట్టాడు. బాబు పుట్టిన 28 రోజుల వ్యవధిలోనే.. అక్టోబర్ మొదలు నుండి చివరి వరకు నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన పల్లె నిద్ర కార్యక్రమంలో కీలకపాత్ర పోషించి రేగా గెలుపులో తనదైన ముద్ర వేశారు. 2018 ఎన్నికల సమయంలో నామినేషన్ పత్రాలు విషయం నుండి, ఎన్నికల ప్రచారం వాహనాలు, పేపర్లో ఎన్నికల ప్రచార ప్రకటనలు, సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం చేయడంలో కీలకపాత్ర పోషించారు. ఎన్నికల ప్రక్రియ





ఖర్చుల నిమిత్తం ఇచ్చిన డబ్బుల్లో బాధ్యతగా వ్యవహరించి లెక్కలు అన్ని క్లియర్ చేసి 68 వేలు మిగిలిన డబ్బులు ఎమ్మెల్యేకి అప్పగించారంటే కర్నే మురళి నిజాయితీ చెప్పనక్కర్లేదు. ఇలా నాటి నుంచి నేటి వరకు సరైన నమ్మిన బంటుగా ఉంటూ అప్పగించిన ప్రతి పనిని కమిట్‌మెంట్‌తో సక్సెస్‌ఫుల్‌గా కంప్లీట్ చేశారు కర్నే మురళి. ఈ 14ఏండ్లలో ఇద్దరి కలయికతో చేసిన ఏ పనైనా ఇంత వరకు ఫెయిల్యూర్ లేదంటే వారి నిబద్ధత.. అకుంఠిత సంకల్పం ఎలా ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు.




### సామాన్యుడి నుంచి బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షునిగా ఎదిగిన ప్రస్థానం..

కచ్చితమైన మార్పు.. మార్పు కోసం... అనునిత్యం పరితపిస్తూ... రేగా వ్యక్తిత్వాన్ని... చేస్తున్న సేవా, బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలను సామాన్య ప్రజలకు సైతం సరైన రీతిలో చేరువ చేస్తూ... ప్రతి మాట.. ప్రతి కార్యక్రమం వినేలా.. చూసేలా చేస్తున్నారు కర్నే మురళి. అంతేకాదు కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ విప్ జిల్లా క్యాంపు కార్యాలయం నిర్మాణం పూర్తి చేయడంలో, కొత్తగూడెం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఆధునికీకరణ పునర్నిర్మాణం పనులు ముమ్మరంగా పూర్తి చేయడంలో కర్నే మురళి రేయింబవళ్లు శ్రమించారు. ప్రభుత్వ విప్ అయ్యాక, జిల్లా అధ్యక్షుడు అయ్యాక కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఫ్లెక్సీలు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రకటనలు విషయంలో అన్నీ తానై వ్యవహరించారు. ఇలా రేగా అప్పగించిన పనుల విషయంలో 14 ఏళ్ల నుండి ఇప్పటి వరకు ఫెయిల్యూర్ లేదు. చిన్న పనైనా పెద్ద పనైనా తనకు ఏ బాధ్యత అప్పగించిన రేగా, కర్నే మురళి ఇద్దరి ఆలోచన కలయికలో విజయకేతనమే. అలా కర్నే మురళి చేస్తున్న శ్రమను గుర్తించిన రేగా కాంతారావు బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షునిగా నియమిస్తూ ప్రకటించారు.



## కడదాకైనా కాంతన్నతోనే...

నా తుది శ్వాస వరకు రేగా కాంతారావుతోనే పనిచేస్తా. నా కున్న రెండు కళ్లలో నా అనుకునే వాళ్లు ఒక కన్ను అయితే రేగా కాంతారావు మరో కన్ను. మేమిద్దరం ఏ పని మొదలు పెట్టినా ఇప్పటి వరకు ఫెయిల్ అయ్యింది లేదు. రాబోవు ఎన్నికల్లో రేగాతో పాటు జిల్లాలోని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపును భుజాలపై వేసుకుని పనిచేసి గెలిపించుకుంటాం. రేగా గెలుపులో చేసిన ఫార్ములాని, ఫార్మెట్‌ని అన్ని నియోజకవర్గాల్లో అమలు చేస్తాం. రేగా గెలిచి మంత్రిగా చూడాలన్నదే నా కోరిక. బీఆర్ఎస్‌ని జిల్లాలోని అన్ని స్థానాల్లో గెలిపించాలన్నదే మా అంతిమ లక్ష్యం. నాలాంటి వ్యక్తుల్నే ప్రతి నియోజకవర్గంలో తయారు చేసి ప్రతి ఒక్కరం సైనికుల్లా పనిచేస్తాం.

- కర్నే మురళి,
బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు



